అణగారిన జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
1
గురువారం 04 మే 2023

రాజోలుకు సూపర్ లగ్జరీ బస్సు ప్రారంభం

నిర్మల్ : జిల్లా కేంద్రం నుంచి రాజోలుకు సూపర్‌లగ్జరీ బస్సును బుధవారం నిర్మల్ డిపో మేనేజర్ ఎస్.సాయన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బస్సు ప్రతి రోజూ మధ్యాహ్నం 12.30 గంటలకు నిర్మల్ నుంచి బయలు దేరి హైదరాబాద్, విజయవాడ, గుడివాడ, భీమవరం, పాలకొల్లు మీదుగా మరుసటి రోజు ఉదయం 5గంటలకు రాజోలుకు చేరుకుంటుదన్నారు. అదే రోజు సాయంత్రం 7గంటలకు రాజోలు నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం10.35 గంటలకు నిర్మల్ చేరుకుంటుందని చెప్పారు. రెండు రాష్ట్రాల ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సహాయ మేనేజర్లు రాజశేఖర్, శ్రీకర్, విజిలెన్స్ హెడ్‌గార్డ్ ప్రభుదాస్, రిజర్వేషన్ ఇంచార్జ్ టి.వి.రమణ, డ్రైవర్లు ఎమ్‌డి. ఖాన్, అజ్గర్ పాల్గొన్నారు.



పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్లు అందించాలి

ఆసిఫాబాద్ : పెన్షనర్లు తమ లైఫ్ సర్టిఫికెట్లను వెంటనే సమర్పించాలని పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు కర్ణగౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో సభ్యులను ఉద్దేశించి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 69 మంది లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించలేదని అన్నారు. దీనిలో కాగజ్‌నగర్ డివిజన్ నుండి 67, వాంకిడి నుండి ఇద్దరు సమర్పించలేదని అన్నారు. పెన్షనర్ల సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పెండింగ్ డీఏలు అందించాలని అన్నారు. ఏరియర్స్ మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు సదానందం, రామస్వామి, కిష్టయ్య సూరు, గౌరమ్మ, కనకమ్మ, మధుసూదన్‌గౌడ్ పాల్గొన్నారు.



వీఓఏలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేష్



నవతెలంగాణ-నిర్మల్

వీవోఏలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట బుధవారం వీవోఏలు ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ రాంబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బొమ్మెన సురేష్ మాట్లాడారు. అర్హత గల వీవోఏలకు సీసీలుగా ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 15 రోజుల నుంచి ఐకేపీ వీవోఏలు నిరవధిక సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 17,606 వీవోఏలు పని చేస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో మహిళ సంఘాలు ఏర్పాటు చేస్తూ వారి అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. అయినప్పటికీ కేవలం రూ.3900 గౌరవ వేతనం మాత్రమే చెల్లిస్తున్నారని తెలిపారు.

వీవోఏల సమస్యలు పరిష్కరించాలి..

వీవోఏల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దుర్గం నూతన్‌కుమార్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలోనే అతి తక్కువ వేతనంతో వీవోఏలు పని చేస్తున్నారని తెలిపారు. వీవోఏలను వెంటనే సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. గ్రామ సంఘం గ్రేడ్‌తో సంబంధం లేకుండా ప్రతి నెలా వీవోఏలకు అకౌంట్‌లలో వేతనాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు లలిత, వీవోఏలు జయశీల, సాయన్న, ప్రభాకర్, రాజు, మహేష్, స్వప్న, గాయత్రి, గంగజల, పోశెట్టి పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ - లోకేశ్వరం

మండలంలోని మన్మద్ గ్రామంలో బుధవారం ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి మండల నాయకులతో కలిసి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు కలగకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయిస్తోందన్నారు. రైతులు దళారుల బారిన పడకుండా కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసీ చైర్మన్ రాజేష్ బాబు, ఎంపీపీ లలితా భోజన్న, మండల కన్వీనర్ కరిపే శ్యామ్ సుందర్, పిఎసిఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు, వైస్ ఎంపిపి మామిడి నారాయణరెడ్డి, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఎంపిటిసిలు, మండల నాయకులు, పిఎసిఎస్ డైరక్టర్‌లు, పిఎసిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

రైలు కింద పడి ఒకరి మృతి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

చెన్నై నుండి ఉత్తరప్రదేశ్‌కు గయా ఎక్స్‌ప్రెస్ రైలులో వెళుతున్న అనిల్ కుమార్ బర్తియ(35) మంగళవారం రాత్రి ప్రమాదవశాత్తు రైలులో నుండి పడి మృతి చెందినట్లు జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ కె సురేష్‌గౌడ్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వినుకొండలో బైక్ షోరూంలో పని చేసే అనిల్‌కుమార్ తన అన్న కూతురి వివాహం కోసం రైలులో స్వగ్రామం వెళుతుండగా రాలాపేట్-కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌ల మధ్యలో ప్రమాదవశాత్తు రైలులో నుండి పడి పోయి మృతి చెందాడని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మల్టీ వర్కర్స్, కారోబార్ల యూనియన్ ఏకగ్రీవం



నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని 32 గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న మల్టీ పర్పస్ వర్కర్లు, కారోబార్‌ల యూనియన్‌ను బుధవారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా రాచకొండ పోశెట్టి, ఉపాధ్యక్షులుగా కొంచెం భోజన్న, కార్యదర్శిగా రామంచ రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా భరద్వాశ్ హరిప్రసాద్, కోశాధికారిగా నాందేడపు రాజు, సలహాదారుగా జాదవ్ బలరాం, ప్రచార కార్యదర్శిగా సబ్లే మిర్బన్, సభ్యులుగా గజ్జల అశోక్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షులు పోశెట్టి, ప్రధాన కార్యదర్శి హరిప్రసాద్ మాట్లాడుతూ మండలంలోని గ్రామపంచాయతీ వర్కర్ల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

రికవరీ చేసిన సెల్‌ఫోన్ బాధితుడికి అందజేత

కడెం: సెల్ ఫోన్ పోగొట్టుకున్న పడకంటి మహేందర్‌కు పోలీసులు తిరిగి అప్పగించారు. గత నెల 24న పోగొట్టుకున్న ఫోన్ గురించి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయగా ఎస్సై రాజు రికవరీ చేసి బాధితుడికి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మొబైల్ ఫోన్స్ పోగొట్టుకున్నా లేదా చోరీకి గురైనా పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు.

జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలి

- టీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో నిరవధిక దీక్ష
- మద్దతు తెలిపిన వివిధ పార్టీల నాయకులు
- ప్రభుత్వం వెంటనే అందించాలని డిమాండ్

నవతెలంగాణ- ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన వర్కింగ్ జర్నలిస్టులకు ప్రభుత్వం వెంటనే ఇండ్ల స్థలాలు కేటాయించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఇండ్ల స్థలాలు అందించాలనే డిమాండ్‌తో బుధవారం ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట నిరవధిక దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు వివిధ జర్నలిస్టు సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు సంఘీభావం తెలిపి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మెడపట్ల సురేష్, షేక్ మోయిజ్ మాట్లాడుతూ సమాజహితమే లక్ష్యంగా పనిచేస్తున్న జర్నలిస్టులకు ప్రభుత్వం ఇంటి స్థలాలు అందిస్తామని ఇది వరకే ప్రకటించిందని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పలుమార్లు ఈ అంశాన్ని ప్రస్తావించారని తెలిపారు. కానీ రాష్ట్రం ఆవిర్భవించి తొమ్మిదేండ్లు కావస్తున్నా ఇప్పటి వరకు ఇంటి స్థలాల కేటాయింపు జరగడం లేదని పేర్కొన్నారు. దీంతో అనేక ఏండ్ల నుంచి జర్నలిస్టులు అద్దె ఇండ్లలో ఉంటూ అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి స్థలాల విషయమై ఇది వరకే జిల్లా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులకు కూడా పలుమార్లు వినతిపత్రాలు అందించామని పేర్కొన్నారు. కానీ ఈ ప్రక్రియలో జాప్యం జరుగుతోందని వివరించారు. రాష్ట్రంలో పలుచోట్ల జర్నలిస్టులకు స్థలాలు కేటాయించారని ..జిల్లాలోనూ జర్నలిస్టులకు ఇంటి స్థలాలు అందజేయాలని కోరారు. ఈ దీక్షలకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినిరెడ్డి, రాష్ట్ర నాయకుడు కంది శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, ఏఐసీసీ సభ్యురాలు గంద్రత్ సుజాత, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు అన్నమొల్ల కిరణ్, జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ ఆశన్న, దారుల్ హన్సార్ వెల్ఫేర్ సొసైటీ ఉపాధ్యక్షుడు ఆరీఫ్‌ఖాన్, తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీయూడబ్ల్యూజేఎఫ్) జిల్లా అధ్యక్షుడు షాహిద్‌అహ్మద్ తవక్కల్, మీడియా కెమెరామెన్ అసోసియేషన్ అధ్యక్షుడు గంట వినోద్, ఎలక్ట్రానిక్ మీడియా టౌన్ రిపోర్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజేష్ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్ కన్వీనర్ ఏర సుధాకర్, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రొడ్డ దేవిదాస్, సీనియర్ జర్నలిస్టులు నూకల దేవేందర్, బిర్కూర్‌వార్ వెంకటేష్, సంద సురేష్, దత్తాత్రి, సిడాం రవి, అస్మత్ అలీ, అభిలాష్, నిలేష్, ఖిజర్‌యాఫై, మహేందర్, రాజేశ్వర్, శ్రీకాంత్, ప్రవీణ్, అమీన్‌షరీఫ్, నరేష్‌రెడ్డి, దేవారెడ్డి, దీపక్, మహేష్, కిరణ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.









కలెక్టరేట్ ఎదుట ఐకేపీ వీఓఏల నిరసన

- కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కనీస వేతనం అమలు చేయాలని, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఐకేపీ వీఓఏలు సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన బాటపట్టారు. కలెక్టరేట్ ఎదుట నిరవధిక సమ్మెకు పూనుకున్నారు. వీరికి పలు పార్టీలకు చెందిన నాయకులు మద్దతు ప్రకటించారు. ప్రభుత్వం తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ముఖ్యంగా సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే పది లక్షల ఆరోగ్యబీమా, సాధారణ బీమా సౌకర్యం కల్పించాలన్నారు. గ్రామ సంఘం గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా ప్రతినెల వేతనాలు వీఓఏల వ్యక్తిగత ఖాతాల్లో జమ చేయాలన్నారు. ఇతర న్యాయమైన డిమాండ్లన్నింటినీ పరిష్కరించాలన్నారు. అప్పటివరకు తమ పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అనంతరం డీఆర్‌డీఓ కిషన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు అన్నమొల్ల కిరణ్, అధ్యక్షుడు కనుకుంట్ల రాజేష్, ప్రధాన కార్యదర్శి దత్తు, ఉపాధ్యక్షురాలు చంద్రకళ ఉన్నారు.

పలువురి మద్దతు

తమ న్యాయమైన సమస్యల పరిష్కారానికి ధర్నాలు చేయాల్సిన దుస్థితి తెలంగాణ ప్రజలకు కేసీఆర్ కల్పించారని బిజెపి జిల్లా అధ్యక్షులు పాయల్ శంకర్ అన్నారు. కలెక్టర్ కార్యాలయం ముందు ఐకెపి వివోఏల ధర్నాకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్లతో ముందుకు వచ్చిన వారిని నిర్లక్ష్యం చేస్తూ అవమానిస్తున్నారన్నారు. తెలంగాణ సాధన తర్వాత తమ బాధలు తీరుతాయనుకున్న ప్రజలకు నిరాశే మిగిలిందన్నారు. న్యాయమైన వారి డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులు కంది శ్రీనివాస్‌రెడ్డి సైతం మద్దతు తెలిపారు. సమ్మె శిబిరానికి వెళ్లి సంఘీభావం ప్రకటించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చాలీచాలని గౌరవ వేతనం చెల్లించి ఐకేపీ వీఓఏలతో వెట్టిచాకిరి చేయించుకుంటోందని మండిపడ్డారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇచ్చే డబ్బులు ఏ మేరకు సరిపోతాయని ప్రశ్నించారు. కనీస వేతనం 26వేలు చెల్లించి వారిని సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, పది లక్షల వరకు ఆరోగ్య బీమా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. తనవంతు తక్షణ సాయంగా వారికి 25వేల రూపాయలను ప్రకటించారు. ప్రభుత్వం దిగొచ్చి డిమాండ్లు నెరవేర్చేవరకూ సమ్మెను కొనసాగించాలని, తాను అండగా ఉంటానని చెప్పారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

- కలెక్టర్ హేమంత్ సహదేవరావు బోర్కడే

నవతెలంగాణ - కాగజ్‌నగర్

వరి ధాన్యాన్ని దళారులకు అమ్మి రైతులు మోసపోవద్దని కలెక్టర్ హేమంత్ సహదేవరావు బోర్కడే అన్నారు. బుధవారం దహెగాం మండలం లగ్గాం గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో వరిని పండించిన రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలన్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని ప్రయివేటు వ్యక్తులకు అమ్మి నష్టపోవద్దని తెలిపారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకొచ్చిన రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజేశం, సివిల్ సప్లయ్ డీఎం గోపాల్, సీపీఓ తారామణి, ఎంపీడీఓ రాజేశ్వర్‌గౌడ్, తహసీల్దార్ రాథోడ్ ప్రహ్లాద్, ఏడీఏ రాజుల నాయుడు, ఏఓ వంశీకృష్ణ, పీఏసీఎస్ సీఈఓ బక్కయ్య, ఏఈఓ శోభన్, వెన్నెల, రైస్‌మిల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చిలువేరు సత్యనారాయణ, మార్కెట్ కమిటీ కార్యదర్శి సిద్దం భాస్కర్ పలువురు రైతులు పాల్గొన్నారు.



భద్రత పాటిస్తే ప్రమాదాల నివారణ

నవతెలంగాణ-కాగజ్‌నగర్

విద్యుత్ వినియోగదారులు భద్రత పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని ట్రాన్స్‌కో కాగజ్‌నగర్ డివిజనల్ ఇంజనీర్ రాజశేఖర్‌రావు అన్నారు. విద్యుత్ భద్రత వారోత్సవాలను పురస్కరించుకొని డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల ఒకటో తేదీ నుండి ఏడో తేదీ వరకు భద్రతా వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్మికులు తప్పనిసరిగా ఎర్త్‌రాడ్‌లను వాడాలని సూచించారు. వంట పొలాల్లో విద్యుత్ వైర్లు తెగితే వెంటనే తమకు తెలియపర్చాలని అన్నారు. ఇళ్లల్లో బట్టలు ఆరవేసే దండాలకు, విద్యుత్ వైర్లు ఉండేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వ్యవసాయ బోర్ల వద్ద నాణ్యమైన విద్యుత్ వైర్లను వాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ శ్రీనివాస్, ఎఈలు జగన్మోహన్, రవీందర్, కమలాకర్, సబ్ ఇంజనీర్లు శ్రీనివాస్, అఖిల్, శరత్, సిబ్బంది పాల్గొన్నారు.



రెగ్యులర్ అధ్యాపకులుగా బాధ్యతాయుత సేవలందించాలి

- జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శ్రీధర్ సుమన్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రెగ్యులర్ అధ్యాపకులుగా బాధ్యతాయుతంగా సేవలు అందించాలని జిల్లా విద్యాధికారి శ్రీధర్ సుమన్ సూచించారు. కాంట్రాక్టు అధ్యాపకులకు రెగ్యులర్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిన నేపథ్యంలో అధ్యాపక సంఘం ఆధ్వర్యంలో డీఐఈఓను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెగ్యులర్ లెక్చరర్లుగా మారిన ఒప్పంద అధ్యాపకులను జిల్లా మాధ్యమిక విద్యాధికారి అభినందించారు. రెగ్యులర్ అయిన అధ్యాపకులు ఇంటర్ విద్య బలోపేతం చేయడం కోసం కృషి చేయాలని, విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దడానికి మరింత బాధ్యతతో సేవలందించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 19, 20, 21 ప్రకారం మొత్తం 97 మంది ఒప్పంద అధ్యాపకులు రెగ్యులర్ అధ్యాపకుల హోదా పొందారన్నారు. జిల్లా వ్యాప్తంగా 11 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పని చేస్తున్న 95 మంది జనరల్ కోర్సుల లెక్చరర్లు, ఇద్దరు ఒకేషనల్ కోర్సుల అధ్యాపకులు రెగ్యులర్ అయిన సందర్భంగా వారిని అభినందించారు. ఈ సందర్భంగా గజిటెడ్ హోదా పొందిన సందర్భాన్ని పురస్కరించుకొని ఒక్కొక్కరికి గ్రీన్ పెన్ బహూకరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకుల సంఘ నాయకులు బాల్‌కిషన్, శ్రీహరి, సత్యనారాయణ పాల్గొన్నారు.

అర్ధాంతరంగా ముగిసిన సర్వసభ సమావేశం

- గ్రామ కార్యదర్శులకు మద్దతుగా సర్పంచుల బాయ్‌కాట్



నవతెలంగాణ-చింతలమానేపల్లి

ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ డుబ్బుల నానయ్య అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశం అర్ధాంతరంగా ముగిసింది. అధికారులు తమ ప్రగతి నివేదికలు ప్రవేశపెడుతుండగా సర్పంచులు గ్రామ కార్యదర్శుల సమ్మెకు మద్దతు తెలుపుతూ సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు పేర్కొంటూ వెళ్లిపోయారు. దీంతో సమావేశం అర్ధాంతరంగా ముగిసింది. అంతకుముందు మిషన్ భగీరథ నీరు ప్రతి ఇంటికి రావడం లేదని సర్పచులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. రన్‌వెల్లి గ్రామ రైతులు 2018లో డీడీలు చెల్లించినా పంట పొలాలకు ఇప్పటి వరకు విద్యుత్ లైన్ వేయలేదని తెలిపారు. డీడీలు రెన్యువల్ చేసినా విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదని సర్పంచ్ సోమేష్ తెలిపారు. అకాల వర్షాల కారణంగా దెబ్బతిన్న వరి పంటను క్షేత్రస్థాయిలో ఏ వ్యవసాయాధికారి పరిశీలించలేదని ఎంపీపీ నానయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో తహసీల్దార్ మస్కూర్ అలీ, ఎంపీడీవో మహేందర్, కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ నాది హుస్సేన్, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

108 శాతంతో 60లక్షల టన్నుల బొగ్గు రవాణా

- గతేడాది ఏప్రిల్‌తో పోలిస్తే రవాణాపై 5.7శాతం వృద్ధి
- జనరల్ మేనేజర్ల సమావేశంలో ఎండి ఎన్.శ్రీధర్



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి కాలరీస్ కంపెనీ ఈ ఆర్థిక సంవత్సరంలో తొలి నెల అయిన ఏప్రిల్‌లో 60 లక్షల టన్నుల బొగ్గు రవాణా జరిపి గత ఏడాది ఇదే నెలలో జరిపిన రవాణాపై 5.7 శాతం వృద్ధిని నమోదు చేసిందని, బొగ్గు ఉత్పత్తిలో 4.7 శాతం వృద్ధిని, ఓవర్ బర్డెన్ తొలగింపులో 12.6 శాతం వృద్ధిని సాధించిందని సింగరేణి ఎండీ ఎన్.శ్రీధర్ తెలిపారు. హైదరాబాద్ సింగరేణి భవన్‌లో అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లతో నిర్వహించిన ఉత్పత్తి సమీక్ష సమావేశంలో మాట్లాడారు. మే నెలలో సాధించాల్సిన లక్ష్యాలను ఏరియాలకు నిర్దేశించారు. ఏప్రిల్ నెలలో నిర్దేశించిన 55.7 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. నిర్దేశిత 55.8 లక్షల టన్నుల బొగ్గు రవాణాకు 108 శాతంతో 60 లక్షల టన్నుల బొగ్గు రవాణా జరిపామని, అలాగే నిర్దేశిత 410 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తొలగింపు లక్ష్యాన్ని దాటి 102 శాతంతో 422 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తొలగించగలిగామని అభినందించారు. ఇదే ఒరవడితో మే నెలలో మరింత మెరుగ్గా పనిచేసి, నిర్దేశిత లక్ష్యాలు సాధించాలని అన్ని ఏరియాల జీఎంలను, కార్మికులను కోరారు. మే నెలలో 67.58 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలని, దీని కోసం రోజుకు కనీసం 2.20 లక్షల టన్నుల ఉత్పత్తి సాధించాలన్నారు. మే నెలలో 70 లక్షల టన్నుల బొగ్గు రవాణా జరపాలని, దీని కోసం రోజుకు కనీసం 2.26 లక్షల టన్నుల రవాణాకు సంసిద్ధం కావాలన్నారు. 48.05 మిలియన్ క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తొలగించాలని, దీనికోసం రోజుకు కనీసం 15.5 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ తొలగించాలని నిర్దేశించారు. అన్ని ఏరియాలో కొత్త ప్రాజెక్టుల ప్రాంతానికి అవసరమైన భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్ సమస్యలపై ఏరియాల్లో జనరల్ మేనేజర్లు నిరంతరాయంగా స్థానిక కలెక్టర్లు, ప్రభుత్వ అధికారులు, రెవెన్యూ అధికారులతో సంప్రదింపులు జరుపుతూ ఏ పనులూ పెండింగ్‌లో లేకుండా చూడాలని ఆదేశించారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

ఇక 'ప్రజల వద్దకే ప్రజావాణి'

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి మంగళవారం ఆదిలాబాద్ బల్దియా కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణి స్థానంలో ఇకపై 'ప్రజల వద్దకే ప్రజావాణి' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పురపాలక కమిషనర్ ఎ. శైలజ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి మంగళవారం పురపాలక అధ్యక్షుడు జోగు ప్రేమేందర్ అధ్యక్షతన అధికారులతో కలిసి ఒక వార్డులో ప్రజావాణి నిర్వహిస్తామని, ప్రజల నుంచి ఫిర్యాదులే కాకుండా, స్థానిక సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ నెల 9 నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. ఏ వార్డులో కార్యక్రమం ఉంటుందో ఒకరోజు ముందుగానే ఆ వార్డు ప్రజలకు సమాచారం తెలియజేస్తామని వివరించారు.

ప్యారమూర్‌లో కంటి వెలుగు కార్యక్రమం

నవతెలంగాణ- సారంగాపూర్



మండలంలోని ప్యారామూర్ గ్రామంలో బుధవారం కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ దివ్యారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంధత్వ నివారణ కొరకు ప్రతిష్టాత్మకంగా కంటి వెలుగు శిబిరాలను ఏర్పాటు చేస్తుందన్నారు. ప్రతి ఒక్కరు కంటి పరీక్షలను చేసుకోవాలని ఉచితంగా అద్దాలను పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి డైరెక్టర్ సాయన్న, నాయకుడు లింగారెడ్డి, గ్రామ కార్యదర్శి మొహినొద్దిన్, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి



నవతెలంగాణ-భైంసా

పంట చేనులో విద్యుత్ స్తంభం పడిపోయి, విద్యుత్ తీగలు కంచెపై పడటంతో విద్యుత్ షాక్ తగిలి రైతు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన ముధోల్ మండలం మచ్కల్ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ సాయికిరణ్,స్థానికుల కథనం ప్రకారం మండలంలోని మచ్కల్ గ్రామానికి చెందిన రైతు ఆనందరావు (68) తన వ్యవసాయ చేనుకు బుధవారం ఉదయం వెళ్ళాడు. తన చేన్లో సాగు చేసిన వేరుశనగ పంటకు అడవి జంతువుల నుండి కాపాడుకోవడానికి కంచె వేయించాడు. అయితే వ్యవసాయ బోరు బావిల కనెక్షన్ల కోసం వేసిన విద్యుత్ స్తంభం గాలి,వానకు ఆ విద్యుత్ తీగలు పక్కనే ఉన్న కంచెపై పడ్డాయి. ఎప్పటిలాగే రైతు వేరుశనగ పంటలోకి ప్రవేశించడానికి ప్రయత్నించగా,విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందారు. తన పంట చుట్టూ ఉన్న కంచెపై విద్యుత్ తీగలు పడటంతో దీన్ని రైతు గమనించకపోవటంతో ఈసంఘటన చోటు చేసుకుంది. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు.మృతుడికి భార్య, కొడుకు, కూతుళ్లు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

బదిలీపై వెళ్తున్న సిబ్బందిని సన్మానించిన సీఐ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉద్యోగాల్లో బదిలీలు సహజమని ఆదిలాబాద్ టూటౌన్ సిఐ పురుషోత్తం అన్నారు. ఇటీవల సాధారణ బదిలీల్లో భాగంగా టూ టౌన్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వర్తించి వివిధ పోలీస్ స్టేషన్లకు వెళ్తున్న సిబ్బందిని ఆయన బుధవారం ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఏ విధంగానైతే ఇక్కడ పనిచేశారో అదేవిధంగా బదిలీ అయిన స్థానంలో కూడా మంచిగా పనిచేయాలని సూచించారు. ఎక్కడున్నా వృత్తికి గుర్తింపు తీసుకొచ్చేలా పనిచేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు విష్ణు, ఉషన్న, సిబ్బంది ఉన్నారు.

ఎమ్మెల్యేలను కలిసిన మహార్ నేతకాని సంఘ నాయకులు



నవతెలంగాణ-తలమడుగు

జిల్లా కేంద్రంలో నేతకాని మహార్ సంఘ నాయకులు బుధవారం ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న, బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్‌ను కలిశారు. మహర్ నేతకాని కులస్తుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాడి నర్సయ్య ఆధ్వర్యంలో మెమోరాండం ఎమ్మెల్యేలకు అందించడం జరిగిందని తెలిపారు. ఆర్డీవో ద్వారా మహార్ కుల ధ్రువీకరణ పత్రాలు విచారణ పేరుతో జాప్యం జరుగుతుందోని తెలిపారు. కుల ధ్రువీకరణ పత్రం సకాలంలో అందకపోవడంతో విద్యార్థులు ఆయా పాఠశాలల్లో సీట్లు కోల్పోవాల్సి వస్తోందన్నారు. కులధ్రువీకరణ పత్రాలు సయయానికి అందక నిరుద్యోగులు ఉద్యోగాలకై, ప్రభుత్వం కేటాయించిన పథకాల కోసం దరఖాస్తులు చేయలేక అనర్హులవుతున్నారని తెలిపారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టి తహసీల్దార్ ద్వారా కుల ధ్రువీకరణ పత్రాలు అందించాలని కోరారు. నేతకాని కుల ధ్రువీకరణ పత్రాలు రాష్ట్ర ప్రభుత్వం గెజిట్‌లో "నెట్ కానీ" గా, కేంద్ర ప్రభుత్వం గెజిట్ లో నేతాని గా వస్తున్న పత్రాలు పరిష్కారం కాక ఇబ్బందుల్లో ఉన్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో సంఘం ఆదిలాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి మునేశ్వర్ సుదర్శన్, పాటిల్ దీపక్, హటకర్ దిలీప్, మునేశ్వర్ స్వప్నిల్, కాయపక్ అశోక్, భగత్ ప్రకాష్, మునేశ్వర్ భీంరావ్, ఏరికార్ గంగన్న, దుర్గే సునీల్, కాంబ్లే ఉదయ్, కాయపక్ కాంతాబాయి, మునేశ్వర్ ఇందిరా, పాటిల్ రుక్మీనా, బౌరే లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

వేసవి క్రీడా శిక్షణలను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ- అదిలాబాద్‌రూరల్

క్రీడాకారులు వేసవికాలంలో వచ్చే సెలవులను వృధా చేసుకోకుండా క్రీడల పట్ల ఆసక్తి చూపుతూ వేసవి క్రీడా శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఆదిలాబాద్ జిల్లా యువజన, క్రీడల అభివద్ధి అధికారి (డీవైఎస్ఓ) వెంకటేశ్వర్లు సూచించారు. ఆదిలాబాద్ రూరల్ మండలం అంకోలి ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న వేసవి కబడ్డీ క్రీడా శిక్షణ శిబిరాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులతో కలిసి క్రీడాకారులకు క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 16 ప్రాంతాల్లో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. నెలరోజులపాటు జరిగే ఈ శిక్షణ తరగతులను క్రీడాకారులు సద్వినియోగం చేసుకొని తమ క్రీడల పట్ల మెలకువలను మెరుగు పరుచుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఇటుకల భూమన్న, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కంటె నర్సయ్య, రఘుపతి, మాజీ ఎంపీటీసీ కనక రమణ, పితటి నాందేవ్, నరేందర్ రెడ్డి, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

ఆరో రోజుకు కార్యదర్శుల సమ్మె



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మె ఉధృత రూపం దాలుస్తోంది. ప్రొబేషనరీ పీరియడ్ ముగిసినందున వెంటనే తమను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న నిరవధిక సమ్మె బుధవారం ఆరో రోజుకు చేరుకుంది. తమ న్యాయమైన డిమాండ్లను తక్షణమే నెరవేర్చాలంటూ నినాదాలతో హోరెత్తించారు. తమ కష్టం ఫలితంగానే ఎన్నో జాతీయ స్థాయి అవార్డులు తెలంగాణకు దక్కుతున్నాయన్నారు. కానీ ప్రభుత్వం తమను క్రమబద్ధీకరించకుండా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ప్రభుత్వం దిగొచ్చేవరకూ సమ్మెను విరమించే ప్రసక్తేలేదని తేల్చి చెప్పారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆటపాటల ద్వారా సమ్మెను మరింత ఉధృతం చేస్తున్నారు.

కంది శ్రీనివాస్‌రెడ్డి మద్దతు

రాష్ట్ర ప్రభుత్వానికి పాడే కట్టి శవయాత్ర నిర్వహించాలని, అప్పుడే తమ న్యాయబద్ధమైన డిమాండ్లు నెరవేరుతాయని బీజేపీ రాష్ట్ర నాయకులు కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రెగ్యులర్ చేయాలని కోరుతూ జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ఆందోళన రోజురోజుకూ ఉధృతమవుతోంది. కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం ఆరో రోజుకు చేరుకుంది. సమ్మె శిబిరాన్ని బీజేపీ రాష్ట్ర నాయకులు కంది శ్రీనివాస్‌రెడ్డి సందర్శించి సంఘీభావం తెలిపారు. క్షేత్రస్థాయిలో జేపీఎస్‌లతో అన్ని పనులు చేయించుకుని రెగ్యులర్ చేయమంటే మొండివైఖరి ప్రదర్శిస్తోందని రాష్ట్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. వారేదో గొంతెమ్మ కోర్కెలు కోరడంలేదని, తమకు దక్కాల్సిన హక్కులను, న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలనే సమ్మెబాట పట్టారని అన్నారు. వారి సేవలను ఉపయోగించుకుని వారి పట్ల నిర్దాక్షిణంగా వ్యవహరించడం భావ్యం కాదని తెలిపారు. తక్షణమే న్యాయబద్ధమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

గిరిజనుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

- ఐటీడీఏ పీఓ వరుణ్ రెడ్డి

నవతెలంగాణ-ఉట్నూర్

గిరిజనుల ఆరోగ్యంపై ఐటీడీఏ ప్రత్యేక దృష్టి సారించిందని పీఓ వరుణ్‌రెడ్డి తెలిపారు. ఏజెన్సీలోని గిరిజన ఆరోగ్యాన్ని సంరక్షించడం కోసం ఐటీడీఏ ఆధ్వర్యంలో ఐదు ఆరోగ్య సంరక్షణ బృందాల వాహనాలను బుధవారం ఐటీడీఏ కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ గిరిజనుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని జిల్లాకు రెండు, కుంరం భీం ఆసిఫాబాద్ జిల్లా, మంచిర్యాల జిల్లాలకు ఒక్కొక్కటి వాహనాలను కేటాయించినట్లు పీఓ వివరించారు. ఈ బృందంలో వైద్యాధికారి, స్టాఫ్‌నర్స్, మందులతో కూడిన వాహనం కూడా ఉంటుందన్నారు. మారుమూల గిరిజన ప్రాంతాలకు వెళ్లి వైద్య శిబిరాలు ఏర్పాటు, గర్భిణీలు, బాలింతలను పరీక్షించి తగు వైద్య చికిత్సలు, హైరిస్క్ కేసులను గుర్తించి తగు సూచనలు, చికిత్సకు రిఫర్ చేయడం, క్షయవ్యాధి, కుష్టువ్యాధి, విరేచనాలతో బాధపడుతున్న వారిని గుర్తించడం, మధుమేహం, రక్తపోటు, కంటి వ్యాధులను గుర్తించి చికిత్స చేయడం వంటి



వ్యాధులను గుర్తించి వైద్య సేవలు అందించడం ముఖ్య ఉద్దేశమన్నారు. వైద్య శిబిరాలకై వస్తున్న ఈ వాహనాల సేవలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. కొమరం బాలు, ఐటీడీఏ ఏపీఓ జనరల్ భీంరావు, వైద్యులు అనికేత్, కార్తీక్, జీవంత్‌రావు తదితరులు ఉన్నారు.

యువత అనుకున్న లక్ష్యాన్ని సాధించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తల్లిదండ్రుల కలలను సాకారం చేసేలా యువత కష్టపడి చదువుతూ అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. బుధవారం

- స్టడీ మెటీరియల్ పంపిణీ చేసిన ఎమ్మెల్యే

జిల్లా కేంద్రంలోని బీసీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్-2 మూడు నెలల ఉచిత శిక్షణ పూర్తయిన అభ్యర్థులకు బుధవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. అభ్యర్థులకు పుస్తకాలను అందజేసి వారికి దిశానిర్దేశం చేశారు. గ్రూప్-2 పరీక్షలను దృష్టిలో ఉంచుకుని బీసీ స్టడీ సర్కిల్‌లో మూడు నెలల పాటు ఉచిత శిక్షణ అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆగస్టు చివరి వారంలో గ్రూప్-2 పరీక్ష ఉన్న నేపథ్యంలో అభ్యర్థులు నాలుగు నెలల సమయాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కష్టపడి చదివిస్తున్న తల్లిదండ్రుల కలలను నిజం చేస్తూ జీవితంలో ఉన్నతంగా స్థిరపడాలని ఆకాంక్షించారు. దేశ ప్రగతి కోసం పాటుపడ్డ మహనీయుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుంటూ ముందుకు సాగాలని పేర్కొన్నారు. అనుకున్న లక్ష్యాన్ని సాధించే విధంగా కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీడబ్ల్యూఓ రాజలింగు, స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్, నాయకులు మెట్టు ప్రహ్లాద్ పాల్గొన్నారు.

విద్యుద్ఘాతంతో గేదె మృతి

నవతెలంగాణ - లోకేశ్వరం

మండలంలోని మన్మద్ గ్రామానికి చెందిన రైతు జెడ్ల రాజారాంకు చెందిన గేదె విద్యుద్ఘాతంతో మృతి చెందింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం వర్షం కురిసే సమయంలో గేదె పగ్గం తెంపుకొని విద్యుత్ తీగ ఉన్న ఇనుప కంచెపై పడింది. కంచె దాటుతుండగా షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ.35వేల వరకు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు వేడుకున్నాడు.

దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-నిర్మల్

జిల్లా మహిళల సాధికారత కేంద్రంలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేసేందుకు అర్హులైన మహిళల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారిణి విజయలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా మిషన్ కో ఆర్డినేటర్ 1, జెండర్ స్పెషలిస్ట్ 1, స్పెషలిస్ట్ ఇన్ ఫైనాన్షియల్ లిటరసీ 1, అకౌంట్స్ అసిస్టెంట్ 1, ఎంటిఎస్ 1 పోస్టులకు సంబంధించిన వివరాలు, విద్యార్హతలు, దరఖాస్తు ఫారం నమూనా కోసం జిల్లా అధికారిక వెబ్‌సైట్ చూడాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ అన్ని విద్యార్హతలు, చిరునామాతో కూడిన దరఖాస్తును ఈ నెల 10లోగా జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు.

మన్మద్‌లో బీరప్ప విగ్రహ ప్రతిష్టాపన

నవతెలంగాణ - లోకేశ్వరం

మండలంలోని మన్మద్ గ్రామంలో బుధవారం బీరప్ప విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ సమీపంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో రెండు రోజుల నుండి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మండల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జేపీఎస్‌ల సమ్మెకు ఎంపీపీ, సర్పంచుల మద్దతు

నవతెలంగాణ-సిరికొండ

కొన్ని రోజులుగా సమ్మె చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు బుధవారం జిల్లా కేంద్రంలో ఎంపీపీ పెందూర్ అమృత్‌రావ్, సర్పంచ్‌ల సంఘం నాయకులు సంఘీభావం తెలిపారు. న్యాయ పోరాటం చేస్తున్న జేపీఎస్‌ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పెందూర్ అనిల్‌కుమార్, గంగారాం, రఘురాం, మడావి బాపురావ్, మాజీ సర్పంచ్ పెంటన్న, సూర్యకాంత్, భగవంత్‌రావ్ పాల్గొన్నారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని సోంపల్లి గ్రామానికి చెందిన సోదరుడు యశ్వంత్ కూతురు తనుశ్రీ మూత్రపిండ వ్యాధితో బాధపడుతోందన్న విషయాన్ని గ్రామ యువకుల ద్వారా తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ బుధవారం ఆ గ్రామానికి వెళ్లి వైద్య ఖర్చుల కోసం రూ.5000 ఆర్థిక సాయం అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటానని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. దాతలు ఎవరైన ఆ కుటుంబానికి ఆర్థిక సాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు అమూల్, మాటే నాందేవ్, సంతోష్, జాదవ్ రాము, నానాజీ, శివాజీ పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



నవతెలంగాణ-కడెం

మండలంలోని లింగాపూర్ గ్రామంలో గౌడ సంఘ సభ్యుల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి బుధవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా గౌడ సంఘ నాయకులు మాట్లాడుతూ గౌడ కులస్తులు పడుతున్న కష్టాలు తెలుసుకొని కేసీఆర్ గౌడ బీమా పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. బీమా పథకాన్ని తెచ్చి ధైర్యాన్ని నింపినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు, సీనియర్ నాయకులు బొంగు చిన్నవెంకన్న, మరిపెల్లి రమేష్‌గౌడ్, ఉపాధ్యక్షులు పంజాల రాజు, కార్యదర్శులు గుగ్గిళ్ల బుచ్చగౌడ్, గాజర్ల లక్ష్మీ నర్సయ్య, పోడేటి లక్ష్మాగౌడ్, బొంగు వెంకట్‌గౌడ్, బొంగు లక్ష్మీపతిగౌడ్, గౌడ సంఘం సభ్యులు, జెడ్పిటిసి శ్రీనివాస్‌రెడ్డి, లింగాపూర్ సర్పంచ్ ఆకుల బాలవ్వ లచ్చన్న, ఉప సర్పంచ్ కుమ్మరి రంజిత్, మల్లారెడ్డి, లక్కవోత్తు నారాయణ పాల్గొన్నారు.

యుఐ కేసుల లిక్విడేషన్లు తగ్గించాలి

నవతెలంగాణ-ఖానాపూర్‌రూరల్

సర్కిల్ పరిధిలోని పోలీస్‌స్టేషన్లలో యుఐ కేసుల లిక్విడేషన్లు తగ్గించాలని సిఐ నారాయణ నాయక్ అన్నారు. బుధవారం సర్కిల్ కార్యాలయంలో సర్కిల్ పరిధిలోని ఎస్ఐలతో క్రైమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐలకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో సర్కిల్ పరిధిలోని ఎస్సైలు ఆర్.శంకర్, రజనీకాంత్, రాజు, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

దళిత రైతు పోరాటం ఫలిస్తోంది

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్‌కుమార్



నవతెలంగాణ-నిర్మల్

దళిత రైతు కొబ్బనోళ్ల గంగన్న పోరాటం సఫలీకృతం కాబోతుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఆయన బుధవారం మాట్లాడారు. దళిత రైతు కుటుంబం కలెక్టర్ కార్యాలయం వరకు పొర్లు దండాలు పెడుతూ చేసిన నిరసన ఫలితాన్ని ఇచ్చిందన్నారు. గంగన్న 38రోజులుగా కలెక్టర్ కార్యాలయం ముందు నిరవధిక ధర్నా నిర్వహిస్తున్నాడని తెలిపారు. స్పందించిన కలెక్టర్ దళిత రైతు భూమిని ఆక్రమించిన అబ్దుల్లాపూర్ సర్పంచి, వీడీసీపై మంగళవారం అట్రాసిటీ కేసులు నమోదు చేయించారన్నారు. అలాగే గంగన్న కుటుంబంపై దాడి చేసిన మరో ఏడుగురిపైన కేసులు నమోదయ్యాయన్నారు. వీడీసీకి సహకరించిన లోకేశ్వరం తహసీల్దార్, ఎస్సైపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొబ్బనోళ్ల గంగన్న కుటుంబానికి రూ.5 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. ధర్నా శిబిరంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు డాకూర్ తిరుపతి, ఉపాధ్యక్షుడు గైని మురళీమోహన్ పాల్గొన్నారు.

కార్పొరేట్ తరహాలో గిరిజన విద్య



నవతెలంగాణ-ఉట్నూర్

కార్పొరేట్ తరహాలో గిరిజన విద్యను అందించడం జరుగుతుందని ఐటీడీఏ డీడీ దిలీప్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలోని ఆయన ఛాంబర్‌లో హైదరాబాద్ పబ్లిక్ పాఠశాలలో 1వ తరగతి ప్రవేశాలకు లక్కీడ్రా నిర్వహించారు. ఈ డ్రాను చిన్నారుల మీదుగా చేపట్టారు. ఈ లక్కీడ్రాలో యెర్మ సూర్యాభాన్, హెరకుంర రిత్విక్ ధన్ రాజ్, జూగ్నాక్ హరి చైతన్య, రాథోడ్ చందన, సెడ్మాకి స్నిగ్దాలు ఎంపికైయినట్లు డీడీ తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుకు అయ్యే ఖర్చులు ఐటీడీఏనే భరిస్తుందని తెలిపారు. గిరిజన విద్యార్థులను కార్పొరేట్లలో ఉచితంగా విద్యను అందించడం జరుగుతుందని, ఇలాంటి అవకాశాలను సైతం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ విద్యాధికారులు పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేలా చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. పట్టణంలోని నేతాజీచౌక్‌లో తెలంగాణ భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం స్థానికులకు మంచినీటిని అందచేసి నిర్వాహకులకు అభినందనలు తెలియచేశారు. స్థానిక వ్యాపారస్తులు, పట్టణానికి పనుల మీద వచ్చే వారి సౌకర్యార్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వేసవి కాలంలో ప్రజల దప్పికను తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. మరోవైపు తెలంగాణ ఉద్యమకారుడు సత్యనారాయణ ప్రథమ వర్ధంతి కార్యక్రమాన్ని కైలాస్‌నగర్ లోని వారి స్వగృహంలో నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాల్గొని సత్యనారాయణ చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించి నివాళి సమర్పించారు. ఆయన వెంట ఎంపీపీ మర్శెట్టి గోవర్ధన్, నాయకులు రాము, కొండ గణేష్, గంగారెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలపై వినతిపత్రం అందజేత

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ రిమ్స్‌లో విధులు నిర్వహిస్తున్న వైద్యారోగ్య సిబ్బందికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా పూర్తి చర్యలు తీసుకోవాలని తెలంగాణ వైద్య ప్రజారోగ్య ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు బండారి కృష్ణ కోరారు. ఇటీవల సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోగా బుధవారం రిమ్స్ డైరెక్టర్ జై సింగ్ రాథోడ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించి, ఉద్యోగుల సమస్యలపై వినతిపత్రాన్ని అందచేశారు. అనంతరం సంఘం సభ్యులను పరిచయం చేసుకుని పలు అంశాలపై చర్చించారు. ఈ మేరకు సంఘం జిల్లా అధ్యక్షులు బండారి కృష్ణ మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర నాయకుల సమక్షంలో నూతన కార్యవర్గ ఎన్నిక జరిగిందని తెలిపారు. ఈ నేపథ్యంలో రిమ్స్ డైరెక్టర్‌ను కలిసి పలు అంశాలపై చర్చించినట్లు పేర్కొన్నారు. రిమ్స్ లో పని చేస్తున్న సిబ్బందికి సమస్యలు ఉత్పన్నం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరడం జరిగిందని వెల్లడించారు.

కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

నవతెలంగాణ-కోటపల్లి



గౌడ కులస్తులకు బీమా వర్తింప జేస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయం గౌడ సోదరుల జీవితాల్లో నూతన వెలుగులు నింపుతుందని చెన్నూర్ మండలంలోని కిష్టంపేట సర్పంచ్ బుర్ర రాకేష్ గౌడ్ అన్నారు. బుధవారం గ్రామంలోని గౌడ సోదరులతో కలిసి కేసీఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ బుర్ర రాకేష్ గౌడ్ మాట్లాడుతూ గౌడ సోదరుల ప్రమాద బీమా రు.2 లక్షల నుండి రు.5 లక్షలు పెంచినందుకు గాను గౌడ సోదరులు కేసీఆర్‌కి రుణపడి ఉంటారని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినాకా అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా అభివృద్ధి పథంలో ముందుకు వెళుతున్నారని, ప్రజా సంక్షేమం కోసం కేసీఆర్ ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని అన్నారు.

వేసవి క్రీడా శిక్షణ శిబిరం

నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణి ఉద్యోగుల పిల్లలకు ఈ నెల 5వ తేదీ నుండి 25 రోజుల పాటు గోలేటిలోని శ్రీ భీమన్న క్రీడా మైదానంలో వేసవి క్రీడా శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్టు జీఎం దేవేందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరాలను ఉదయం 6 గంటల నుండి 8 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుండి 7 గంటల వరకు 18 ఏండ్లలోపు చిన్నారులకు వాలీబాల్, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్ శిక్షణ ఇవ్వనున్నారని తెలిపారు. మరోవైపు వేసవి క్రీడా శిబిరం శిక్షకులు పనిచేసేందుకు ఆసక్తి గల వారు(సింగరేణి సీనియర్ క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు, జాతీయ, రాష్ట్రస్థాయిలో ప్రాతీనిధ్యం వహించిన క్రీడాకారులు) తేదీ ఈ నెల 4వ తేదీ గురువారం జీఎం కార్యాలయం పర్సనల్ డిపార్టుమెంటులో సంప్రదించాలని ఆయన కోరారు.

రేపటి నుంచి పంచాయతీ కారోబార్‌ల సమ్మె



నవతెలంగాణ-కాసిపేట

పంచాయతీ కారోబార్‌లు, సిబ్బంది శుక్రవారం నుంచి సమ్మె చేపడుతున్నట్టు బుధవారం తహసీల్దార్, ఎంపీడీఓలకు సమ్మె నోటీస్ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర గ్రామ పంచాయితీ కారొబార్‌లు, సిబ్బంది హక్కుల సాధనకు రాష్ట్ర పంచాయితీ రాజ్ శాఖ కమీషనర్‌కు ఇచ్చిన సమ్మె నోటీస్ ఇవ్వడంలో భాగంగా మండల కేంద్రంలో తాము ఇచ్చినట్టు తెలిపారు. ముందుగా అధికారులకు సమాచారం ఇస్తున్నట్టు పేర్కొన్నారు. హక్కులు సాదించేవరకు సమ్మె కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల గ్రామ పంచాయితీ కారొబార్‌లు, సిబ్బంది సిలోజ్ మురళి, దాసరి రాజయ్య, కటకం దీపక్, మాడవి చిన్ను, షేక్ కరీం, భోగే సత్యనారాయణ పాల్గొన్నారు.

రెండో విడత గొర్రెల పంపిణీకి చర్యలు చేపట్టాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గొర్రెల పెంపకం దారుల సంక్షేమ, ఆర్థిక అభ్యున్నతికి ప్రభుత్వం చేపట్టిన రెండో విడత గొర్రెల పంపిణీకి కార్యచరణ రూపొందించాలని ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్ అన్నారు. బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ రాజేశంతో కలిసి గొర్రెల పంపిణీ కార్యక్రమం నిర్వహణపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండవ విడత గొర్రెల పంపిణీ కార్యక్రమంలో గొర్రెల కొనుగోలు, సేకరణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, జిల్లాకు కేటాయించిన 1,588 యూనిట్ల లక్ష్యానికి అనుగుణంగా గొర్రెలను సేకరించేందుకు జిల్లా స్థాయి అధికారులను నియమించడం జరిగిందని, లబ్ధిదారులు కూడా అధికారులతో వెళ్లి తానే స్వయంగా ఎంపిక చేసుకున్న తర్వాత యూనిట్ల గొర్రెలను వారి ప్రాంతాలకు చేర్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆసిఫాబాద్ జిల్లాకు మహారాష్ట్రలోని చంద్రాపూర్, ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణ జిల్లాల నుండి గొర్రెలను సేకరించేందుకు మార్గదర్శకాలు ఉన్నందున అధికారులు ఎలాంటి లోటుపాట్లు లేకుండా జిల్లాలోని మండలాలకు వాహనాలలో తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని, మధ్య దళారీ వ్యవస్థ ఉండకూడదని, రాష్ట్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. అధికారులకు కేటాయించిన లక్ష్యాలను పూర్తిస్థాయిలో నిర్వహించాలని, ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదని తెలిపారు. అనంతరం ఉద్యానవన శాఖ అధికారులతో కలెక్టరేట్ ఆవరణలో అవసరమైన మొక్కలు, పూల మొక్కలు, నీడనిచ్చే మొక్కలను నాటించే కార్యక్రమం వేగవంతం చేయాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్, ఆసిఫాబాద్ గ్రామపంచాయతీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ భవన సముదాయానికి మిషన్ భగీరథ నీటిని అందించేందుకు పనులు పూర్తి చేయాలని మిషన్ భగీరథ ఏ ఈ కి సూచించారు. కలెక్టరేట్ భవన సముదాయంలో పనుల లక్ష్యాన్ని సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, హెలిపాడ్ ఏర్పాటు పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

జేపీఎస్‌లకు సర్పంచ్‌ల మద్దతు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జూనియర్ పంచాయతీ సెక్రెటరీలు తమ సర్వీసు రెగ్యులర్ చేయడానికి ఉత్తర్వులు విడుదల చేయాలని డిమాండ్‌తో సమ్మె చేస్తున్న జేపీఎస్‌లకు సర్పంచ్‌ల సంఘం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు గుణవంతరావు మాట్లాడుతూ పంచాయతీ సెక్రెటరీ విధుల్లో లేకపోవడంతో పంచాయతీల్లో ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం పరీక్ష నిర్వహించి తీసుకున్న సెక్రటరీల సర్వీసు క్రమబద్ధీకరిస్తూ ఉత్తర్వులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, జేపీఎస్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణ, ప్రధాన కార్యదర్శి శ్రావణ్ కుమార్ గౌడ్, కోశాధికారి ప్రదీప్ గౌడ్, గౌరవ అధ్యక్షుడు మల్లేష్, రాకేష్, ఉపాధ్యక్షులు మల్లీశ్వరి, మనీష్, వంశీ, ప్రేమ్ సాగర్, జాయింట్ సెక్రటరీలు వికాస్, తిరుపతి, శ్రీకాంత్, రవికుమార్, సభ్యులు శ్రీనివాస్, హరిదాస్, మారుతి, శ్రీజ పాల్గొన్నారు.

అక్రమంగా వెలిసిన టేలాలను తొలగించాలి



నవతెలంగాణ-రెబ్బెన

మండలకేంద్రంలోని ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా వెలుస్తున్న టేళాలను అధికారులు వెంటనే తొలగించాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులుగౌడ్ అన్నారు. బుధవారం గంగాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో గల రామాలయం, పశువుల సంత, ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరిసర ప్రాంతాల్లో విచ్చలవిడిగా వెలిసిన టేళాలను బీజేపీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జడ్పీ హైస్కూల్ ప్రక్కన గల ఖాళీ స్థలాల్లో టేళాలు ఏర్పాటుచేసి పాఠశాల స్థలాన్ని, రోడ్డును ఆక్రమిస్తున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తుందన్నారు. వట్టివాగు కాలువకు సంబంధించిన స్థలంలో గంగాపూర్, నంబాల గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి ప్రక్కన రైతువేదిక స్థలాన్ని దర్జాగా ఆక్రమించి టేళాలు ఏర్పాటుచేసినా అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి టేళాలను తొలగించాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు చౌదరి సునీల్, నాయకులు రాంబాబు, మండల ప్రధాన కార్యదర్శి నవీన్‌గౌడ్ పాల్గొన్నారు.

వీవోఏలను సెర్ఫ్ ఉద్యోగులుగా గుర్తించాలి

- మంచిర్యాల గౌరవ అధ్యక్షుడు దుంపల రంజిత్



నవతెలంగాణ - హాజీపూర్

వీవోఏ లను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని వీఓఏల సంఘం గౌరవ అధ్యక్షుడు దుంపల రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు.బుధవారం తెలంగాణ ఐకేపీ వీవోఏ ఉద్యోగుల సంఘం (సీఐటీయు) ఆధ్వర్యంలో మంచిర్యాల ఐబీ చౌరస్తా నుండి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వస్తే మా బతుకులు బాగుపడుతాయనుకుంటే గ్రేడింగ్ విధానంతో పని భారం మోపుతూ ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు.ఈ రోజు గ్రామాల్లో పని చేసే వీవోఏలు అందరు నిరుపేద ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ కుటుంబలకు చెందిన వారే ఉన్నారని తెలిపారు. అందులో మహిళలే ఎక్కువ మంది ఉన్నారన్నారు.కుంటాల కుమార్, దుర్గం రాములు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టే ప్రతి అభివద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, వారిని ఆర్థికంగా, సామజికంగా అభివృద్ధికి తోడ్పాడే వీవోఏల పట్ల ప్రభుత్వ విధానాలు విడనడాలన్నారు.ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. సీఐటీయు జిల్లా అధ్యక్షులు అబ్బోజు రమణ మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో ఎమ్మెల్యేలకు, మంత్రులకు జీతాలు పెంచిన ప్రభుత్వం వీవోఏలకు జీతాలు పెంచక పోవడం చాలా దారుణమని, నిరుపేదలైన వీవోఏలకు డబుల్ బెడ్ రూం, ఇండ్ల స్థలలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకురాలు రామిండ్ల రాధిక మాట్లాడుతూ..రాష్ట్రంలో వీవోఏల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని, వారికి కనీస వేతనం 26వేలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో పొట్ట పోషం ,రమాదేవి జి. రజిత - బుట్ట అనిత, పి. మహేష్, రజిత, సురేష్, జిల్లా సలహా దారులు జుమ్మిడి లక్ష్మణ్ తుకారాం, దాసు, జిల్లా కమిటీ సభ్యులు జి. వెంకటేష్,టీ. సమ్మన్న, భాగ్యలక్ష్మి, గౌరీ, స్వరూపరాణి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు లావాదేవీలపై రైతులకు అవగాహనా సదస్సు



నవతెలంగాణ-వేమనపల్లి

సహకార బ్యాంకులో తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి తిరిగి రుణాలు పొందాలని ఏడీసీసీ బ్యాంకు మేనేజర్ సుధాకర్ అన్నారు. బుధవారం నీల్వాయి సహకార సంఘం ఆవరణలో నాబార్డు వారి సౌజన్యంతో నుక్కడ్ నాటక్ కళాజాత ప్రదర్శన ద్వారా నీల్వాయి ఏడీసీసీ బ్యాంకు ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సు నిర్వహించారు. బ్యాంకులో సహకార సిరి డిపాజిట్ పథకంపై అత్యధికంగా 7.25 శాతం వడ్డీ లభిస్తుందని మేనేజర్ అన్నారు. పొదుపు పథకాలు, వ్యవసాయ, వ్యాపార, బంగారు రుణాలు, ఇన్సూరెన్స్ పథకాలు, సైబర్ నేరాల గురించి వై.రమేష్ కళాజాత బృందం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ సుధాకర్, సూపర్ వైజర్ సంతోష్, స్టాఫ్ అసిస్టెంట్ వెంకటస్వామి, సొసైటీ సీఈఓ మధుకర్, సిబ్బంది ప్రసాద్, వెంకటేష్, కళాకారులు రమేష్, జయక్రిష్ణ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



నవతెలంగాణ-కోటపల్లి

పేద ప్రజల సంక్షేమమే ప్రధాన ఆశయంగా సీఎం కేసీఆర్ పనిచేస్తున్నారని, సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఎంతో మంది నిరుపేదలకు ఆర్థిక చేయూత అందిస్తున్నట్టు చెన్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ బైసా ప్రభాకర్ అన్నారు. మండల కేంద్రలోని వారణాసి సరోజకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి రూ.1లక్ష చెక్కును ఇంటికి వెళ్లి ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత అన్ని వర్గాల సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని అన్నారు. పేద ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిరన్నారు. కార్యక్రమంలో నాయకులు మంత్రి రామయ్య, బెల్లంపల్లి మల్లయ్య, సుందిళ్ళ మొండి, కోమట్ల శ్రీకాంత్, కొంకటి సుధాకర్, పుప్పాల సతీష్ రాళ్లబండి శ్రీనివాస్, రాగం స్వామి పాల్గొన్నారు.

అధికారులు పనితీరు మార్చుకోవాలి

- ఎమ్మెల్యే ఆత్రం సక్కు
- మండల పరిషత్ సర్వసభ్య సమావేశం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

అధికారులు పనితీరు మార్చుకోవాలని, ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని ఎమ్మెల్యే ఆత్రం సక్కు సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ మల్లికార్జున్ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి జడ్పీటీసీ నాగేశ్వరరావుతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు శాఖలపై సమీక్ష చేస్తూ వారిని ఉద్దేశించి మాట్లాడుతూ అధికారులు పని తీరు మార్చుకోవాలన్నారు. సభ్యులు వివిధ శాఖల సమీక్ష సందర్భంగా తీసుకువచ్చిన సమస్యలపై ఆగ్రహం వ్యక్తంచేశారు. గిరి గ్రామాలకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా ఇవ్వడంలో ఆలస్యం చేయకూడదని ఆదేశించారు. జడ్పీటీసీ నాగేశ్వరరావు మాట్లాడుతూ కంటి వెలుగు కార్యక్రమం ద్వారా మండలంలో గుర్తించిన 326 మందికి ఆపరేషన్ చేయిస్తామని దానికోసం ప్రణాళిక రూపొందించాలన్నారు. ఎన్నికల సీజన్ వస్తుందని ఎక్కడ పనులు పెండింగ్ ఉండకుండా చూడాలన్నారు. మండలంలో పెండింగ్‌లో ఉన్న గ్రామాల్లో భగీరథ నాల్లాలకు వెంటనే ట్యాపులు బిగించాలని వాటికి అవసరమైన బడ్జెట్ ఎస్టిమేషన్ తయారుచేసి సమర్పించాలన్నారు. గొర్రెల పంపిణీకి సంబంధించి కులం సర్టిఫికెట్ కోసం యాదవులను ఇబ్బందులకు గురి చేయకూడదని, మండలంలో యాదవులకు ఒకేసారి నాయకులు అధికారులు సమావేశం నిర్వహించి గొర్రెల పంపిణీ కార్యక్రమం చేపట్టడానికి ప్రయత్నాలు చేస్తామన్నారు. ఎంపీపీ మల్లికార్జున్ మాట్లాడుతూ మిషన్ భగీరథ మండలంలోని వివిధ ప్రాంతాల్లో లీకేజీలు ఉన్నాయని వాటిని నివారించడానికి శాశ్వత ప్రాతిపదికన ఒక ప్లంబర్ నియామకం జరుగుతున్నట్లు తెలిపారు. ఏ గ్రామాల్లో లీకేజీ ఉన్న ప్లంబర్ వచ్చి దానిని సవరిస్తారని తెలిపారు. వైస్ ఎంపీపీ మంగ మాట్లాడుతూ మిషన్ భగీరథ నీరు ఇంటింటికి ఇవ్వకుంటే రానున్న ఎన్నికల్లో ఓటర్ల దగ్గరికి వెళ్లలేమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శశికళ, ఎంపీఓ ప్రసాద్ పాల్గొన్నారు.

రేపు బాబాపుర్‌లో ప్రజా ఫిర్యాదుల విభాగం

నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండలంలోని బాబాపూర్ గ్రామంలో శుక్రవారం ప్రజా ఫిర్యాదు విభాగం ఉంటుందని తహసీల్దార్ మస్కుర్ అలీ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల విభాగంగా ఆసిఫాబాద్ కలెక్టర్ హేమంత్ బొర్కాడే, ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పాల్గొననున్నట్టు తెలిపారు. బాబాపూర్, రన్‌వెల్లి, లంబడేటి, భూరేపల్లి, గంగాపూర్, కోసిని, ఆయా గ్రామల రైతు ప్రజలు భూములపై ఉన్న సమస్యలు, ఆర్ఓఎఫ్ఆర్ భూ పట్టా పాస్ పుస్తకంపై పేర్ల తప్పిదాలతో పాటు, ప్రాణహిత చేవెళ్ల కెనాల్‌ల్లో భూములు కోల్పోయిన లబ్ధిదారులు, భూముల విస్తీర్ణంలో లోపాలుపై ప్రజా ఫిర్యాదుల విభాగంలో అర్జి చేసుకోవచ్చని తెలిపారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు వీలుంటుందన్నారు.

ఫిజియోథెరపీ యూనిట్‌ని పరిశీలించిన జీఎం

నవతెలంగాణ-నస్పూర్



శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-8 డిస్పెన్సరీలోని ఫిజియోథెరపీ యూనిట్‌ను బుధవారం శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి.సంజీవరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ ఫిజియోథెరపీ చేయించుకోవడానికి వచ్చిన వారితో మాట్లాడుతూ ఫిజియోథెరపీ యూనిట్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మోకాళ్ళ నొప్పులు, నడుము నొప్పులు, వివిధ రకాల ఎక్సర్సైజులు చేసుకోవడానికి ఎంతో ఉపయోగపడుతుందని శ్రీరాంపూర్ ఏరియాలో ఉన్న ఉద్యోగులందరూ దీనిని ఉపయోగించుకోగలరని కోరారు. ఈ సందర్భంగా డీవై సీఎంఓ డాక్టర్ రమేష్‌బాబు జనరల్ మేనేజర్‌తో ప్రతిరోజు సుమారు 30 మంది ఫిజియోథెరపీ యూనిట్ కి వచ్చి వారి సమస్యలు పరిష్కరించుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రీడా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా క్రీడా యువజన శాఖ అధికారిని మణెమ్మ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని గిరిజన బాలిక ఆశ్రమ పాఠశాలలో క్రీడా శిబిరాలకు అవసరమైన క్రీడా సామాగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా క్రీడా యువజన శాఖ అధికారి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికారి ఆదేశాల మేరకు ఈ నెల 1 నుండి 31వ తేదీ వరకు జిల్లా క్రీడా, యువజన శాఖ ఆధ్వర్యంలో 10 క్రీడా అంశాలలో వివిధ మండలాల్లో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ శిబిరాలకు కావలసిన క్రీడ సామాగ్రిని పంపిణీ చేస్తున్నట్టు పేర్కొన్నారు. వేసవి కాలంలో చిన్నారులకు ఈ సమ్మర్ క్యాంప్ ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. శిబిరాలు నిర్వహించడానికి ముందుకు వచ్చిన 10 మంది శిక్షకులను అభినందిస్తూ వారికి క్రీడా సామాగ్రి, టీ షర్ట్స్ పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏటీడీఓ క్షేత్రయ్య, క్రీడా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్.కృష్ణారావు, అథ్లెటిక్ కోచ్ విద్యాసాగర్, పీఈటి రాకేష్, బాక్సింగ్ సెక్రటరీ శేఖర్, పీడీ తిరుపతి పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సమ్మెకు మద్దతు



నవతెలంగాణ - కాసిపేట

మండల కేంద్రంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల నిరవధిక సమ్మెకు బుధవారం జిల్లా యూత్ కాంగ్రెస్ కార్యదర్శి రత్నం ప్రదీప్ మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేసీఆర్ పాలన చూస్తుంటే ఇది ధనిక రాష్ట్రం కాదు ధర్నాల రాష్ట్రం అని ప్రజలకి అర్థమవుతోందన్నారు. ఒక వైపు వీఓఏల ధర్నా ఇప్పుడు జేపీఎస్‌ల ధర్నా ఇంతకముందు వీఆర్ఎస్‌ల ధర్నా ఇలా చెప్పుకుంటూ పోతే ఏ ఉద్యోగి కూడా కేసీఆర్ పాలనలో సంతోషంగా లేరన్నారు. ఇక రానున్న రోజుల్లో కేసీఆర్‌కు ప్రజలే బుద్ధి చెప్తారన్నారు. జూనియర్ పంచాయితీ కార్యదర్శులు ఎలాంటి కార్యాచరణ తీసుకున్న కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు గుండా రాజుకుమార్, దుర్గం ప్రవీన్, జాడి మల్లేష్, బోర్లాకుంట ప్రణయ్, సంకూరి రాజుకుమార్, సురేష్, బోర్లాకుంట రాజు, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ నిధులు మంజూరు చేయాలి

- మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు సుజాయిత్ ఖాన్



నవతెలంగాణ-కెరమెరి

పెండింగ్‌లో ఉన్న కల్యాణలక్ష్మీ, షాధిముభారక్ నిధులు మంజూరు చేయాలని మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు సుజాయిత్ ఖాన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కల్యాణలక్ష్మీ, షాధిముభారక్ లబ్ధిదారులు మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్షున్ని కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏడాది గడిచిన నేటికి కల్యాణలక్ష్మీ, షాదిముబారక్ డబ్బులు అందక పోవడంతో ఆడపిల్లల పెళ్లిళ్లు చేసిన నిరుపేద తల్లిదండ్రులు అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పథకంతో పేద మద్య తరగతి కుటుంబాలు లబ్ధి పొందుతున్నప్పటికి సమయానికి డబ్బులు అందక మనోవేదనకు గురవుతున్నారని తెలిపారు. పెళ్లిళ్ల కోసం అప్పులు చేసి, అప్పులు తీర్చేందుకు తంటాలు పడాల్సి వస్తుందన్నారు. డబ్బులు రాకపోవడంతో వడ్డీ చెల్లించలేక సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మానవ దృక్పథంతో స్పందించి, కళ్యాణలక్ష్మీ, షాదిముబారక్ డబ్బులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో లబ్దిదారులు ఆనందకర్ లక్ష్మీ రేఖ, ఫర్జాన, రాధ రాథోడ్ సందీప్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
గురువారం 04 మే 2023

పర్సునంబాలలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్



మండలంలోని పర్సునంబాల గ్రామంలో డాక్టర్ బీఆర్.అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖులు అంబేద్కర్ గొప్పతనాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మీ, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు, ఎంపీపీ మల్లికార్జున్ యాదవ్, సింగిల్ విండో చైర్మన్ అలిబిన్ అహ్మద్, సర్పంచ్ విమల కిష్టయ్య, ఎంపీటీసీ గోగుల సుశీల, ఎస్ఎంసీ చైర్మన్ కొయ్యల వినేష్, సెంటర్ కమిటీ అధ్యక్షులు జాడిబాపు, లుంబిని దీక్ష భూమి కమిటీ అధ్యక్షులు ముంజ మనోహర్, సర్పంచ్‌లు బీసీ భూమేష్, పెద్దపల్లి శ్రీనివాస్, బాబురావు, సువర్ణ వినోద్, సెంట్రల్ కమిటీ ప్రధాన కార్యదర్శి దుర్గం సుధాకర్, వార్డు సభ్యులు బొట్టుపల్లి కుమార్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న విద్యుత్ భద్రతా వారోత్సవాలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మే ఒకటో తేదీ నుండి ఏడో తేదీ వరకు నిర్వహించ తలపెట్టిన విద్యుత్ భద్రత వారోత్సవాలు జిల్లా కేంద్రంలో కొనసాగుతున్నాయి. బుధవారం ఆసిఫాబాద్ ఏడిఈ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులు భద్రతలు పాటిస్తే ప్రమాదాలను నివరించవచ్చునని అన్నారు. కార్మికులు భద్రతా సూత్రాలు పాటిస్తూ పని చేయాలని, పని చేసే స్థలాల్లో ఎర్త్ రాడ్‌లు తప్పనిసరిగా వాడాలన్నారు. వినియోగదారులు కరెంటు వైర్లు తెగిపడినపుడు సంబంధిత సిబ్బందికి తెలియజేయాలన్నారు. దండాల మీద బట్టలు ఆరవేస్తున్నప్పుడు ఆ దండాలు కరెంటుకు సంబంధించిన వైర్లకు దూరంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ ఇంజనీర్ ఫెరోజ్ ఖాన్, సబ్-ఇంజనీర్ శేఖర్, లైన్-ఇన్స్‌పెక్టర్ సన్మాన్ రావ్ పాల్గొన్నారు.

డీఎంఎఫ్టీ నిధులపై శ్వేత పత్రం విడుదల చేయాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దుర్గం దినకర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

సింగరేణి ప్రాంతంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులకు సంబంధించి డీఎంఎఫ్టీ నిధులపై శ్వేత పత్రం విడుదల చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దుర్గం దినకర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో బొగ్గుగనులతో ప్రత్యక్షంగ పరోక్షంగా ప్రభవిత ప్రాంతాల్లో ప్రజలు దుర్భర పరిస్థితులను ఎదుర్కుంటున్నారన్నారు. ఆయా గ్రామాల అభివృద్ధి పనులకు ఏటా సింగరేణి విడుదల చేస్తున్న డీఎంఎఫ్టీ నిధులు జిల్లాలో పక్కదారి పట్టాయన్నారు. జిల్లాకు 2017-2018 సంవత్సరంలో రూ.132 కోట్లు విడుదల చేసినప్పటికీ అయ గ్రామాలలో నేటికీ అభివృద్ధి జరగలేదని, జిల్లా అధికారులు, కాంట్రాక్టర్లు కలిసి నిధులను అబివృద్ధికి కాకుండా వృధాగా ఖర్చు చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలకు అవసరం ఉన్న చోట పనులు జరగడం లేదని తెలిపారు. వెంటనే నిధులపై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు గోడిసెల కార్తిక్, దుర్గం రాజ్ కుమార్, నాయకులు టీకానంద్, శ్యామ్ పాల్గొన్నారు.

పేదలపై కేసులు పెట్టడం దుర్మార్గం

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యుడు పైళ్ల ఆశయ్య



నవతెలంగాణ-హాజీపూర్

కబ్జాదారులను వదిలేసి పేదలపై కేసులు పెట్టడం దుర్మార్గపు చర్య అని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యుడు పైళ్ళ ఆశయ్య అన్నారు. బుధవారం అదనపు కలెక్టర్ మధుసూధన్ నాయక్ కు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆశయ్య మాట్లాడుతూ మంచిర్యాల జిల్లా చెన్నూరు మండల పరిధిలోని బాబురావుపేట శివారు సర్వేనెంబర్ 8లో 27 ఎకరాల భూమి ప్రభుత్వం అసైన్మెంట్ చేసి పేదలకు ఇచ్చారన్నారు. ధనవంతులు, భూ కబ్జాదారుల ఆగడాలు భరించలేక అప్పటి నుండి ఇప్పటివరకు పేదలు భూమిలో సాగులో లేరనీ తెలిపారు. అసైన్మెంట్ భూమి అంత అధికార పార్టీ కౌన్సిలర్లు కబ్జాలు చేసి ప్లాట్లు వేసి అమ్ముకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వ భూమిని కాపాడి పేదలకు పంచాలని సీపీఐ(ఎం) నాయకత్వంలో పేదలు గత ఐదు రోజులుగా ఇళ్ల స్థలాలు ఇవ్వాలని పోరాటం చేస్తున్నారని తెలిపారు. 27 ఎకరాలు ప్రభుత్వ భూమి అయినప్పటికీ స్థానిక అధికారులు ఈ భూమిని ఇళ్లస్థలాలకు పంచకుండా ధనవంతులకు, కబ్జాలదారులకు అమ్ముడుపోయి ఏమి తెలవనట్లుగా ఉంటున్నారన్నారు. పైగా ప్రభుత్వ భూములను కాపాడడానికి పోరాటం చేస్తున్న పేదలపైన, వారిపోరాటనికి మద్దతు తెలిపిన నాయకులపైన అధికార పార్టీ నాయకుల ఒత్తిడితో పోలీస్‌లు అక్రమ కేసులు, బైండోవర్ కేసులు పెట్టి బెదిరింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. మరో ప్రక్క అధికార పార్టీ కౌన్సిలర్లు పోరాటం చేస్తున్న పేదలను బెదిరిస్తున్నరని తెలిపారు. కబ్జా దారుల నుంచి అసైన్మెంట్ భూమిని ప్రభుత్వం, అధికారులు కాపాడకపోతే పేదలే కాపాడుకుంటారన్నారు. సర్వే నం.8 గల భూమిలో అసైన్డ్ హక్కుదారులు లేనందున రీ అసైన్డ్ మెంట్ చేసి పేదలకు ఇంటి స్థలాలుగా పంచాలని డిమాండ్ చేశారు. పేదలపై, నాయకులపై పెట్టిన అక్రమ కేసులను, బైండోవర్లను ఎత్తివేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు రాజేశ్వరి, బోడెంకి చందు, అవేజ్, ఇండ్ల స్థలాలు పోరాట పేదలు శ్రీనివాస్, రేణుక, మణి, సంధ్యరాణి, నషిన, శారద, రాజేశ్వరి, సలీమ, రమ్య, పోశక్క, ఉమరాణి, మల్లేశ్వరి పాల్గొన్నారు.

ఆరోగ్య మహిళా కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మహిళల ఆరోగ్యం, సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన ఆరోగ్య మహిళా కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ అన్నారు. బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆరోగ్యం కోసం ప్రభుత్వం ఆరోగ్యానికి మహిళ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ క్రమంలో గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. స్కానింగ్ యంత్రాలు సక్రమంగా నిర్వహించాలని, ఇద్దరు వైద్యుల నియామకాన్ని చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని, రక్తహీనత కేసుల వివరాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఉన్న ఖాళీల వివరాలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వారీగా నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రథమ, ద్వితీయ, ట్రై మిస్టర్ కార్యక్రమాలు చేపట్టాలని, అవసరమైన వారికి మందులు పంపిణీ చేయాలని తెలిపారు. ప్రతినెల గర్భిణులను సమయానుసారంగా పరీక్షించి వారి ఆరోగ్యానికి, సుఖ ప్రసవానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని, ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్య పెరిగే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. వేసవికాలం దృష్ట్యా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని గ్రామాలలో జ్వరం, వడదెబ్బలపై ప్రతిరోజు పర్యటించి అవసరమైన చికిత్సలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రామకృష్ణ, ఉప వైద్యాధికారులు సుధాకర్ నాయక్, సునీల్ రావు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు పాల్గొన్నారు.

కౌన్సిలర్లకు శాశ్వత పెన్షన్ అమలు చేయాలి



నవతెలంగాణ-నస్పూర్

మున్సిపల్ కౌన్సిలర్లకు రూ. 5వేలు శాశ్వత పెన్షన్ అమలు చేయడంతో పాటు రూ.15వేలు గౌరవ వేతనం మంజూరుచేయాలని తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ కౌన్సిల్ ఫోరం, మంచిర్యాల జిల్లా చైర్మన్ చిడం మహేష్ అన్నారు. బుధవారం ఆయన నవతెలంగాణ పత్రికతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో గత నవంబర్, డిసెంబర్ నెలలో కౌన్సిల్ సభ్యులకు శాశ్వత పెన్షన్ రూ.5000 మంజూరు చేయాలని, ప్రతి వార్డు అభివృద్ధికి రూ.50 లక్షలు నిధులు కేటాయించాలని, కౌన్సిల్ సభ్యులకు హెల్త్ కార్డు మంజూరు చేసి ఉచిత వైద్య సదుపాయం కార్పొరేట్ స్థాయిలో అందించాలని అందరూ ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా మున్సిపాలిటీలకు ప్రతి సంవత్సరం ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు, మహిళ కౌన్సిల్ సభ్యులకు స్కూటీలు మంజూరు చేయాలని, హైదరాబాదులో కౌన్సిల్ సభ్యుల కొరకు విశ్రాంతి భవనం ఏర్పాటు చేయాలని తీర్మానం చేసి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించడం జరిగిందని తెలిపారు. కౌన్సిల్ సభ్యుల సమస్యలు పరిష్కారం కోసం మే 8వ తేదీన మంచిర్యాల జిల్లా బెల్లంపల్లికి మున్సిపల్ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు వస్తున్న సందర్భంగా సమస్యలపై వినతి పత్రాన్ని అందజేయుటకు కౌన్సిల్ సభ్యులు అందరూ కలిసి రావాలని కోరారు.

యువత జాతీయ సమగ్రతకు పాటుపడాలి

- ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఆత్మకూరు చిరంజీవి
- ఘనంగా ఏఐవైఎఫ్ 64వ ఆవిర్భావ దినోత్సవం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

యువత జాతీయ సమగ్రతకు పాటుపడాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఆత్మకూరు చిరంజీవి అన్నారు. అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) 64వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. జెండా ఆవిష్కరించి అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో డిగ్రీ పూర్తిచేసిన ప్రతి ఒకరికి ఉపాధి అవకాశాలు కలిపించాలని డిమాండ్ చేశారు. విద్య, వైద్యం, ఉపాధి హక్కుల సాధన కోసం తాము నిరంతరం పోరాటాలు చేస్తున్నామన్నారు. నేటి పాలకులు స్వార్థ రాజకీయాల కోసం యువతను చెడు మార్గంలో పయనించేలా చేస్తున్నారని, సమాజ బాధ్యతను నేర్పకుండా సమాజం అభివృద్ధి సాధించదని అన్నారు. ఈ తరుణంలోనే తాము దేశ వ్యాప్తంగా పౌరులందరికి సమాన విద్య అందించాలని, వైద్యం అందించాలని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే నినాదంతో ఉద్యమిస్తున్నామని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దేశంలో మతోన్మాదం హెచ్చుమీరిందని, ఈ విధానాలు దేశ సమగ్రతను దెబ్బతీసేలా ఉన్నాయని వారు ఉద్ఘాటించారు. విధానాలను పోకడలను ప్రజలపై రుద్దడానికి తీవ్ర దుష్ట ప్రయత్నాలు చేస్తున్నారని, ఈ చర్యలు శాస్త్రీయ దృక్పథం కలిగిన భారత పౌరులు తిప్పికొట్టాలని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భగత్ సింగ్ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని రూపొందించి, అమలు చేయాలని, ఈ చట్టం ద్వారా నిర్దిష్టమైన ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ రంగాలలో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొదురుపాక మహేష్, గోగర్ల మల్లికార్జున్, గోనే గణేష్, ఉట్నూరు సురేష్ ఆత్మకూరి ప్రమోద్, చౌదరి మహేష్ పాల్గొన్నారు.

వ్యాక్సినేషన్ కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-వాంకిడి

యూటీహెచ్‌సీ వాంకిడిలోని హెచ్‌డబ్ల్యుసీ బెండారా గ్రామంలో గల వ్యాక్సినేషన్ కేంద్రాన్ని కొమురం భీం జిల్లా డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సుధాకర్ నాయక్ బుధవారం సందర్శించి హెచ్‌డబ్ల్యుసీ రికార్డుల పనితీరును పరిశీలించారు. అనంతరం వ్యాక్సినేషన్‌లో పాటించాల్సిన నియమ నిబంధనలను సమయపాలనపై మానిటరింగ్ చేశారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వినయ్, ఎంపీహెచ్ఈఓ శ్యాంలాల్, రవిదాస్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

శ్రమశక్తి గ్రహీతకు సన్మానం



నవతెలంగాణ-రెబ్బెన

ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్ రవీంద్రభారతిలో మే డే వేడుకల్లో తెలంగాణ ప్రభుత్వం ద్వారా శ్రమశక్తి అవార్డు పొందిన ఖైరిగూడ సీనియర్ మైనింగ్ సర్దార్, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం జీఎం కమిటీ సభ్యులు గజ్జెల్లి చంద్రశేఖర్‌కు ఖైరిగూడ ప్రాజెక్టు మేనేజర్ ప్రవీన్ పాంటింగ్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మేనేజర్ పాంటింగ్ మాట్లాడుతూ శ్రమశక్తి అవార్డు పొందడం అభినందనీయమని, ఆయన అందించిన సేవలకు గుర్తింపుగా అవార్డు రావడం చాలా సంతోషకరమని తెలిపారు. అనంతరం తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఏరియా వైస్ ప్రెసిడెంట్ మల్రాజ్ శ్రీనివాస్‌రావు, ఏఐటీయూసీ యూనియన్ నాయకులు, ఇతర ఉద్యోగులు చంద్రశేఖర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఖైరిగూడ మేనేజర్ ప్రవీన్ పాంటింగ్, టీబీజీకేయస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ మల్రాజ్ శ్రీనివాస్‌రావు, డీవైపీఎం వేణు, గని ఎన్విరాల్‌మెంటన్ అధికారి జె సూర్యనారాయణ, టీబీజీకేయస్ ఫిట్ కార్యదర్శి వెంకటేశం, టీబీజీకేయస్ ఏరియా కమిటీ గని సేఫ్టీ, మైన్స్ కమిటీ సభ్యులు, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

వీఓఏల చలో కలెక్టరేట్ విజయవంతం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఐకేపీ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన చలో కలెక్టరేట్ ర్యాలీ జిల్లా కేంద్రంలో విజయవంతమైంది. అంబేద్కర్ చౌక్ నుండి ర్యాలీగా కలెక్టరేట్ వరకు చేరుకొని కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కనీస వేతనం రూ.26,000 చెల్లించడంతో పాటు ఇతర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం డిమాండ్ల పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని కోరారు. గత 12 రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పరిష్కారం కోసం చర్యలు తీసుకోకపోవడం దారుణం అన్నారు. సమ్మె విరమిస్తే చర్చలు జరుపుతామని అధికారులు చెబుతున్నారని గతంలో ఎన్నో సందర్భంలో ఇవే మాటలు చెప్పారని గుర్తు చేశారు. అధికారుల తీరు నిరసిస్తూ సమ్మె చేస్తున్నట్లు ప్రభుత్వం వెంటనే సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఓఏల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు రాజేందర్, జిల్లా అధ్యక్షురాలు జ్యోతి, రాష్ట్ర నాయకురాలు సునీత, సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, సీఐటీయూ జిల్లా నాయకులు కృష్ణమాచారి, నాయకులు ధనరాజ్, అన్నపూర్ణ, భరత్, జేవంత్, రవీందర్, ఆనందరావు, నారాయణ, సంతోష్, విజయ్, దత్తు, తుకారాం, రవి, బుద్దు పాల్గొన్నారు.

ఆదివాసీ గిజనులకు సంక్షేమ పథకాలు అందాలి

- ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్



నవతెలంగాణ-ఉట్నూర్

ప్రభుత్వ అభివద్ధి, సంక్షేమ పథకాలను ఆదివాసీ గిరిజనులకు అందేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం ఉట్నూర్ ఐటీడీఏ క్యాంపు కార్యాలయ సమావేశ మందిరంలో ఐటీడీఏ ద్వారా చేపడుతున్న పనుల పురోగతి, సంక్షేమ పథకాల అమలుపై సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆదివాసీ గిరిజన ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా ఐటిడిఎ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆశ్రమ పాఠశాలలో ఇంజినీరింగ్ శాఖ ద్వారా చేపట్టిన మరుగుదొడ్లు, భోజన శాల, ప్రహరీగోడ, స్నానపు, అదనపు తరగతి గదులు, ఇతరత్రా పనులను వెంటనే పూర్తి చేసి వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే పూర్తిచేయాలని సూచించారు. నిర్మాణంలో ఉన్న



ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బర్త్ వెయిటింగ్ హాల్లు, అంగన్వాడీ కేంద్రాల భవనాలను వెంటనే పూర్తిచేయాలని అన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఏజెన్సీ పరిధిలో ముందస్తు చర్యలు చేపట్టాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. బాలింతలు, గర్భిణీలు, చిన్నారులలో రక్తహీనతను నియంత్రించేందుకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఆది ఆదర్శ గ్రామయోజన పథకం క్రింద ఎంపిక చేసిన 24 గిరిజన గ్రామాలలో సీసీరోడ్లు, డ్రైనేజీలతో పాటు కనీస మౌలిక సదుపాయాలు కల్పించి ఆదర్శ గ్రామాలుగా మార్చేదిశగా తీర్చిదిద్దాలని అన్నారు. మారుమూల గిరిజన గ్రామాలు, తండా ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించే దిశగా రూ.153 కోట్ల నిధులతో 122 బీటీ రోడ్లను మంజూరు చేసిందని అన్నారు. అగ్రిమెంట్, సాంకేతిక, టెండర్ల ప్రక్రియను పూర్తిచేసి పనులను ప్రారంభిచేలా చర్యలు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పీవీటీజీ కుటుంబాల ఆదాయం పెంచేలా పౌల్ట్రీ ఫామ్ యూనిట్‌లను, మారుమూల తండావాసులకు సోలార్ విద్యుత్, బయోగ్యాస్ యూనిట్లను మంజూరు చేయాలన్నారు. నిరుద్యోగ యువత స్వయం ఉపాధి పొందేలా వృత్తి నైపుణ్య శిక్షణలను అందించాలని సూచించారు. సీఎం గిరి వికాసం పథకం క్రింద బోరు, విద్యుత్ మోటార్ల మంజూరుతో పాటు, మారుమూల ప్రాంతాలకు త్రి ఫేస్ విద్యుత్ సౌకర్యం కల్పించాలని అన్నారు. ఆర్థిక సహకారం అందేలా ఎంపీడీఓల ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించి అర్హులైన లబ్దిదారులకు రుణాలు అందజేయాలని అన్నారు. ఈ సమావేశంలో శిక్షణ సహాయ కలెక్టర్ పి.శ్రీజ, డిప్యూటీ డైరెక్టర్ డా.దిలీప్ కుమార్, ఎపిఓ కె. భీంరావు, ఆర్డీఓ సురేష్, ఈఈ రాథోడ్ భీంరావు, అదనపు వైద్యారోగ్య శాఖ అధికారి కొమురం బాలు, ఎపిఓ పీవీటీజీ భాస్కర్, ఓఎస్డీ కృష్ణయ్య, ఏఓ రాంబాబు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని చెడ్వాయి గ్రామానికి చెందిన ఇసుక ట్రాక్టర్‌ను తహసీల్దార్ సరిత బుధవారం పట్టుకున్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ యజమాని తిరుపతికి రూ.5 వేల జరిమానా విధించారు. ఎవరైన అక్రమ రవాణా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సింగరేణి పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభం

నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియా గోలేటిలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో ప్రవేశం కోసం విద్యార్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పాఠశాల కరస్పాండెంట్ ఐ లక్ష్మణ్‌రావు(పర్సనల్ మేనేజర్) బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2023-24 విద్యా సంవత్సరానికి గాను ఇంగ్లీష్ మీడియం ఒకటో తరగతి నుండి 9వ తరగతి వరకు, తెలుగు మీడియం 8వ తరగతి నుండి 10వ తరగతి వరకు అడ్మిషన్లు ప్రారంభించామన్నారు. సింగరేణి కార్మిక, కార్మికేతరులు తమ పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం సింగరేణి పాఠశాలలో చేర్పించాల్సిందిగా ఆయన కోరారు.

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

నవతెలంగాణ-కోటపల్లి

చెన్నూర్ మండలంలోని నారాయణపూర్ ,సుద్దాల, వెంకంపేట గ్రామాలలో బుధవారం ఐకేపీ, పీఏసీఎస్, డీసీఎంఎస్ వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.రైతులు వరి ధాన్యాన్ని వరి కొనుగోలు కేంద్రాలలో అమ్ముకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ మంత్రి బాపు, జెడ్పీటీసీ మోతే తిరుపతి,వైస్ ఎంపీపీ వెన్నపురెడ్డి, బాపురెడ్డి, పీఏసీఎస్ సీఓ రత్నలక్ష్మీ, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించేందుకే వరి ధాన్యం కొనుగోలు



నవతెలంగాణ-లోకేశ్వరం

రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన వరి ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తుందని పీఏసీఎస్ చైర్మన్ సిరిపురం రత్నాకర్‌రావు అన్నారు. మండలంలోని జోహార్‌పూర్, వాస్తాపూర్, పంచగుడి గ్రామాలలో బుధవారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ చైర్మన్ సిరిపురం రత్నాకర్ రావు, గ్రామ సర్పంచ్ ఏర్రవ్వ దిగంబర్, ఎంపీపీ మామిడి నారాయణ రెడ్డి, గ్రామ రైతులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏ గ్రేడ్‌కు క్వింటాలు వరి ధాన్యానికి రూ.2060, బీ గ్రేడ్ ధాన్యానికి రూ.2040 మద్దతు ధరలతో గ్రామ గ్రామాలలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి ధాన్యాన్ని సేకరిస్తుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ చిన్నయ్య, సెక్రెటరీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించిన డీఎంహెచ్ఓ



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని సింగరాయపేట గిరిజన గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని మంచిర్యాల జిల్లా డీఎంహెచ్ఓ సుబ్బారాయుడు, ప్రోగ్రాం అధికారి ఫయాజ్‌ఖాన్ బుధవారం సందర్శించారు. కంటి వెలుగు శిబిరం సింగరాయపేట గ్రామంలో ముగియడంతో ఆ గ్రామ సర్పంచ్, జైనేని భీమయ్య, కంటి వెలుగు సిబ్బందిని సన్మానించి ప్రశంసా పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ప్రతి గ్రామంలో ఉచితంగా నిర్వహిస్తున్న కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉచితంగానే పరీక్షలు నిర్వహించి మందులు అందించి, అవసరం ఉన్నవారికి కంటి అద్దాలను ఇవ్వడం జరుగుతుందన్నారు. దీన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఉమాశ్రీ డాక్టర్ గంగాదేవి, డాక్టర్ జుబేర్, హెల్త్ సూపర్‌వైజర్ పోసాని చంద్రలీల, హెల్త్ అసిస్టెంట్ కొల్హారి కమలాకర్, దేవమ్మ, ఆఫ్టర్ మిస్ట్ వరలక్ష్మి డిఇఓ రజిత, ఆశాలు సుజాత, శారద తిరుమల, కంటి వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.